క్లుప్తంగా

శ్రీరామునికి ప్రత్యేక అలంకారం



కూర్మావతారంలో రాములవారు

సూళ్లూరుపేట: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసియున్న శ్రీసీతారాముల దేవస్థానంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని వసంత నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని శ్రీవరాహ అలంకారంతో అలంకరించారు.

పింఛన్ అందజేత

దొరవారిసత్రం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని 4781 మంది వివిధ రకాల పింఛన్‌దారులకు మంగళవారం సాయంత్రానికి 4566 మందికి సచివాలయ సిబ్బంది అందజేశారు. దీంతో 95.50 శాతం పూర్తి చేసినట్లు స్థానిక ఎంపీడీఓ గోవర్ధన తెలియజేశారు. మేలుపాక, తల్లంపాడు తదితర గ్రామాల్లో పింఛన్ పంపిణీ తీరును ఆయన పరిశీలించారు.

రూ.5.07 కోట్లు పన్నుల వసూలు

సూళ్లూరుపేట: పురపాలక సంఘం పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.5.07 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేశామని కమిషనర్ కె.చిన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.73.71 లక్షల వరకు అధికంగా పన్నులు వసూలు చేశామని, ఒక్క మార్చి నెలలోనే రూ.1.30 కోట్లు పన్నులు చెల్లించారని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధితో భాగస్వాములయ్యారని తెలిపారు. పన్నుల వసూలుకు కృషి చేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.రమేష్, రెవెన్యూ ఆఫీసర్ పీఎంవీ నారాయణరెడ్డి, అడ్మిన్ కార్యదర్శులు రెవెన్యూ సిబ్బంది, నోడల్ ఆఫీసర్స్ అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

హక్కులపై అవగాహన అవసరం



చింతవరంలో సివిల్ రైట్స్‌డే

చిల్లకూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండల తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలో మంగళవారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరి చేయించే యజమానులపై అధికారులకు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్ సుగుణమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

కండలేరులో 48.517 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 48.517 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1320, పిన్నేరుకాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం



ఎమ్మెల్యే నుంచి బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

చిల్లకూరు: గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులు సొంత నిధులు వెచ్చించి నూతనంగా వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కోర్టులో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల విజేతలకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా మైదానం అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, కోటేశ్వరరావు, నిమ్మకాయల రవి, శేఖర్, సాయి, వెంకట్, పురుషోత్తం, మస్తాన్ జగదీష్, మునీఫ్, సందీప్, గోవర్ధన్, హరి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ మధు(50) మంగళవారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స చేయించుకుంటూ నాయుడుపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. ఒక్కసారిగా అస్వస్థతకు గురై ఇంటి వద్దే మృత్యువాత పడ్డారు. అతని పార్థివ దేహాన్ని నెల్లూరులోని వారి స్వగృహానికి తరలించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబీ, సంగమేశ్వరావు, ఎస్‌ఐలు, పోలీసులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరులో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని కాపులూరు దరఖాస్తు కండ్రిగ గ్రామానికి చెందిన తుపాకుల వెంకటరమణయ్యను కత్తితో నరికి చంపిన అతని తమ్ముడు తుపాకుల బాబును మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ బాబీ తెలిపారు. గత నెల 28వ తేదీ ఆస్తి విషయమై గొడవ పడిన వెంకటరమణయ్య అతని తల్లిపై కత్తితో దాడి చేస్తుండగా ప్రతిఘటించారు. అన్న చేతిలో ఉన్న కత్తిని తమ్ముడు బాబు లాక్కొని గొంతుపై నరకడంతో వెంకట రమణయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసులో పరారీలో ఉన్న బాబును మంగళవారం అయ్యప్పరెడ్డిపాళెం గ్రామ రహదారి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

కూటమి నేతల కుయుక్తులు

మండలంలోని శిరసనంబేడు గ్రామంలో టీడీపీ నేతలు కుయుక్తులు పన్ని పేదల భూములను కాజేయాలని చూస్తున్నారు. ఈ గ్రామంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములకు పరిహారం కోసం ఇరవయ్యేళ్లుగా ఎదురు చూస్తున్న పేదల ఆశలకు కూటమి నేతలు గండి కొడుతున్నారు. అడ్వాన్స్ పేమెంట్ పేరుతో మాయమాటలు చెప్పి భూములు కోల్పోయిన రైతును మభ్య పెడుతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దందా చేస్తున్న కూటమి మాయగాళ్లపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

– పెళ్లకూరు

- పేదల భూములపై డేగ కన్ను
- శిరసనంబేడులో భూమాయ
- అడ్వాన్స్ పేమెంట్‌తో భూపత్రాలు స్వాధీనం!
- అధికారులపై పెత్తందారుల తీవ్ర ఒత్తిడి



శిరసనంబేడు గ్రామంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములు

మండలంలోని శిరసనంబేడు గ్రామంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో అర్హులకు న్యాయం జరుగుతుందో..లేదోనన్న సందేహం స్థానికుల్లో మొదలైంది. గ్రామంలోని సర్వే నంబరు 287నుండి 334 వరకు ఉన్న 201.59 ఎకరాల భూములను గతంలో సెజ్‌కి కేటాయించారు. అయితే గడిచిన ఇరవయ్యేళ్లలో కేవలం ఒకేఒక్క స్టీల్ పరిశ్రమ మాత్రమే ఇక్కడ స్థాపించారు. అప్పటి నుండి భూములు అప్పగించిన రైతులు పరిహారం కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. అయితే ఇక్కడ పెత్తందారులుగా చలామణి అవుతున్న టీడీపీ నాయకులు కొందరు భూ దందాలకు తెగబడుతున్నారు. పేదల భూములను తారుమారు చేయడం, పట్టాదారు పేర్లు మార్చేయడం, పేదల భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాలను అప్పుల పేరుతో లాక్కోవడం ఇలా ఎన్నెన్నో అక్రమాలు గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్నాయి. ఇక్కడ 176.96 ఎకరాలు భూములు పేదల పేర్లతో పట్టాలు ఉన్నాయి. 24.63 ఎకరాలు మిగులు భూములున్నాయి.

అడ్వాన్స్ పేమెంట్ ఆశలు

ఇరవయ్యేళ్ల నుంచి పేదల పేర్లతో ఉన్న భూములను చాలా అప్పట్లోనే ఏపీఐఐసీకి కేటాయించారు. ఈ భూముల విషయంలో కొందరు కూటమి నాయకులు, స్థానిక భూస్వాములు కుమ్మక్కై అమాయకుల కడుపు కొట్టే పనిలో నిమగ్నమయ్యారు. దశాబ్దాలుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్న రైతులను మాయమాటలతో మభ్యపెడుతున్నారు. శిరసనంబేడు, రాజుపాళెం ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని, భూములకు తక్కువ పరిహారం ఇస్తారని నష్టపోతారని చెబుతున్నారు. అందుకే పట్టాలు, పాసుపుస్తకాలు అప్పగిస్తే ఒక ఎకరానికి రూ.10 లక్షలు చొప్పున ముట్టజెబుతామని, వెంటనే రూ.50 వేలు అడ్వాన్స్ పేమెంట్ అందిస్తామని ఆశ చూపుతున్నారు. తామే కొనుగోలు చేస్తామని జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన భూములను ఫ్రీహోల్డ్ తర్వాత రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ఒప్పందం చేసుకుంటున్నట్లు సమాచారం.

పేదల కష్టమే పెట్టుబడి

నాయుడుపేట, మేనకూరు ప్రాంతాలకు చెందిన కూటమి నాయకులతో చెన్నైకు చెందిన వ్యాపారులతో మధ్యవర్తిత్వం చేసి జోరుగా పావులు కదుపుతున్నారు. అలాగే మరి కొందరు స్థానిక భూస్వాములు పేదల కష్టాలను ఆసరాగా చేసుకొని పట్టాదారు పాసు పుస్తకాలపై చిన్నచిన్న మొత్తాలను చెల్లించి, స్వాధీనం చేసుకోవడం విశేషం. అలాగే గ్రామంలో మిగిలివున్న 24.63 ఎకరాల అనాధీనం భూములకు బినామీ పేరుతో పట్టాలు చేసుకునేలా కొందరు టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి భూ మాఫియా నేతల నుండి రైతులను కాపాడేలా రెవెన్యూ అధికారుల ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రెవెన్యూ చట్టాలు ఉల్లంఘిస్తే చర్యలు

శిరసనంబేడు, రాజుపాళెం ప్రాంతాల్లో పేదల భూముల విషయంలో ఎవరైనా రెవెన్యూ చట్టాలను ఉల్లంఘించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. పరిశ్రమల స్థాపన కోసం భూములు కావాలన్న విజ్ఞాపనలపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– ద్వారకానాథ్‌రెడ్డి, తహశీల్దార్ పెళ్లకూరు

ప్రశాంతంగా పది పరీక్షల ముగింపు



పరీక్ష కేంద్రం నుంచి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు

సైదాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారంతో పటిష్ట బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని సైదాపురం, కలిచేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 265 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. మండలంలోని అనంతమడుగు, చాగణం, మర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, ఊటుకూరు, గిద్దలూరు, కలిచేడుకు చెందిన 115 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు సజావుగా ముగియడంతో విద్యార్థులు ఆనందంగా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ–2 ప్రసాద్ తెలిపారు. మండలంలోని అరవపాళెం, చిట్టమూరు ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్, కొత్తగుంట గ్రామంలో ఉన్న టీఎమ్మార్ స్కూల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మూడు సెంటర్లలో 390 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు.

జీతాల్లో కోత పెట్టొద్దు



ర్యాలీ చేస్తున్న స్మార్ట్ మీటర్ల ఉద్యోగులు

నాయుడుపేట టౌన్: జీతాల్లో 50 శాతానికి పైగా కోత విధించేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం స్మార్ట్ మీటర్ల ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద నుంచి నాయుడుపేట స్మార్ట్ మీటర్ల ఉద్యోగులు ప్రభుత్వ తీరును ఎండగడుతూ ర్యాలీ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉద్యోగ భద్రత కల్పించేలా పాత విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఉద్యోగ సంఘ నాయకులు కంట్లాం లక్ష్మయ్య, గురువంశీ, నాగరాజు, రమేష్, సురేష్‌బాబు, తులసిదాసు, కిషోర్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకం అవినీతిమయం

కోట: ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో అధికారులు, సిబ్బంది భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని 21 పంచాయతీల్లో గత పది రోజులుగా డీఆర్పీలు గత ఏడాది నుంచి జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మస్టర్లలో మాయాజాలం వెలుగు చూసినట్లు సమాచారం. గూడలి, చెందోడు, కొత్తపాళెం పంచాయతీలో మస్టర్ల నమోదులో భారీగా అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. కొందరు పనులకు రాకపోయినా వారు పనులు చేసినట్లు చూపించి రూ.లక్షల మేర ప్రభుత్వ సొమ్మును దారి మళ్లించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇవన్నీ సోషల్ ఆడిట్‌లో బహిర్గతం కావడంతో ఉపాధి హామీ పథకం కోట మండల అధికారి రికార్డులను మాయం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ఉపాధిహామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్‌ను వివరణ కోరగా త్వరలో జరగనున్న ప్రజావేదికలో అన్నీ విషయాలు వెల్లడిస్తామన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వార్షిక ప్రణాళిక తయారీపై శిక్షణ

చిట్టమూరు: పొదుపు సంఘాల సభ్యుల వార్షిక జీవనోపాధి ప్రణాళికపై 2025 ఆర్థిక సంవత్సరానికి స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం గున్నయ్య శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పొదుపు సంఘాల్లోని సభ్యులు ఈ ఆర్థిక సంవత్సరంలో తాము బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాల వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందు పరిచే విధానంపై మెళకువలు నేర్పుతున్నామని ఏపీఎం గున్నయ్య తెలిపారు. సంఘబంధం అధ్యక్షురాలు నాగూరమ్మ, ఎన్యుమరేటర్‌లు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

కేఆర్‌ఆర్ యువసేన సేవలు అభినందనీయం



రాజారెడ్డి దంపతులకు సత్కారం

నాయుడుపేట టౌన్: వైఎస్‌ఆర్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి సారథ్యంలో కేఆర్‌ఆర్ యువసేన యువత చేస్తున్న సేవ కార్యక్రమాలను పలువురు నాయకులు అభినందించారు. నాయుడుపేట పట్టణంలోని కేఆర్‌ఆర్ కార్యాలయంలో మంగళవారం రాజారెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, చిల్లకూరు బాలక్రిష్ణారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, కటకం జయరామయ్య, పోలేరమ్మ ఆలయ మాజీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, చదలవాడ కుమార్, పాపాడి చంద్రారెడ్డి తదితర నాయకులు రాజారెడ్డి, భారతి దంపతులకు శాలువాలు కప్పి, గజ మాలలతో ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు నార్నేపాటి రవిశర్మ, వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. ముస్లిం మత పెద్దలు, క్రిస్టియన్ పాస్టర్లు వేర్వేరుగా రాజారెడ్డి దంపతులకు ఆశీర్వాదాలు అందించారు.

పాస్టర్ మృతిపై నిజాలు తేల్చండి



మాట్లాడుతున్న పాస్టర్ల సంఘ నాయకులు



క్రైస్తవుల శాంతి ర్యాలీ

నాయుడుపేట టౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి మిస్టరీని చేధించి న్యాయం చేయాలని నాయుడుపేట డివిజన్ పాస్టర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్ముగం నగర్‌లో ఉన్న గ్రేస్ గాస్పెల్ జీసస్ చర్చి వద్ద మంగళవారం పాస్టర్లు సమావేశమై, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ సంఘ నాయకుడు జాన్ మార్క్ మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో దర్యాప్తు చేపట్టి అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి హిందూ, ముస్లిం, క్రిస్టియన్లంతా మద్దతు తెలపాలని కోరారు. జోసెఫ్‌రాజు, చీరాల శాంత వర్ధన్, పామంజి ప్రవీణ్ కుమార్, కె.విజయ కుమార్, ఐజక్, ఆర్.జోసెఫ్, డి.రాజేష్, జి.అబ్రహం, క్రిస్టియన్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు భద్రత కల్పించాలి

చిల్లకూరు: క్రైస్తవులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చిలో భాగమైన గూడూరు పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘ సభ్యులు అన్నారు. రాజమండ్రి ప్రాంతంలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి వెనక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం చర్చి నుంచి టవర్ క్లాక్ సెంటర్ మీదుగా మార్కెట్ రోడ్డులో పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీని మంగళవారం నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ ప్రవీణ్‌కుమార్, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు, రాజయ్య, నవీన్ విజయకుమార్, దాని ప్రవీణ్, డేవిడ్, స్టాలిన్, హన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపండి



వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తడ: దశాబ్దాలుగా తడ బజారులో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపాలని ఏఐటీయూసీ సూళ్లూరుపేట నియోజకవర్గ కౌన్సిల్ సభ్యుడు తడ తహశీల్దార్ శరత్‌ని కోరారు. వీధి వ్యాపారులతో కలిసి మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించిన నాయకులు 2001లో జాతీయ రహదారి విస్తరణ సమయంలో రోడ్డు పక్కన వ్యాపారాలు సాగిస్తున్న వారు జీవనోపాధి కోల్పోయారన్నారు. అప్పటి అధికారులు ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం వ్యాపారం సాగిస్తున్న స్థలం చూపారని వివరించారు. ప్రస్తుతం అదే పరిస్థితుల నేపథ్యంలో ఉన్నపళంగా వ్యాపారులను ఖాళీ చేయాలని ఆదేశించడం అన్యాయమన్నారు. వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపితే ఖాళీ చేస్తారని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సి.సుధాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు నాగేంద్ర, వ్యాపారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌కు క్రీడాకారుల ఎంపిక



రెజ్లింగ్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారురులు

నాయుడుపేట టౌన్: రాష్ట్రస్థాయిలో జరిగే రెజ్లింగ్ పోటీలకు తిరుపతి జిల్లా జట్టు కోసం మంగళవారం క్రీడాకారులను ఎంపిక చేశారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండులో తిరుపతి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆదవరం అనుదీప్ పర్యవేక్షణలో కోచ్‌లు 60 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు 4, 5, 6వ తేదీలలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. రెజ్లింగ్ సంఘ కన్వీనర్ సురేష్, సెక్రటరీ బి.ఉదయ్‌కుమార్, ట్రెజరర్ ఆదవరం అభిలాష్, కోచ్‌లు ఇందు, లోకేష్, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యూబా కోసం విరాళాల సేకరణ

గూడూరు రూరల్: సోషలిస్టు దేశమైన క్యూబా ప్రజలను ఆదుకునేందుకు జిల్లా కమిటీ పిలుపు మేరకు గూడూరు పట్టణంలో మంగళవారం సాయంత్రం సీఐటీయూ విరాళాలు సేకరించింది. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వివేకానంద రోడ్డు, రైతు బజార్, మార్కెట్ సెంటర్, ముత్యాలపేట, పలు ప్రధాన కూడళ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తూ విరాళాలను సేకరించారు. వసూలు చేసిన నగదును జిల్లా సెంటర్‌కు పంపుతామన్నారు. సీఐటీయూ గూడూరు పట్టణ అధ్యక్షుడు బి.వి.రమణయ్య, సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, వి.భాస్కర్‌రెడ్డి, బి.నారాయణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయ సహాయం



నూతన అసోసియేషన్‌కు సత్కారం

నాయుడుపేట టౌన్: పేదలకు న్యాయ సహాయం అందించడంతోపాటు న్యాయవాదులు సమస్యల పరిష్కారానికి అందరితో కలసి పనిచేస్తామని నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య తెలిపారు. పట్టణంలోని కోర్టు వద్ద న్యాయవాదుల సమావేశ మందిరంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడిగా చిట్టేటి నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పోట్లపూడి శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఎ.పరశురామయ్య, కార్యవర్గ సభ్యులుగా బి.చిరంజీవి బాబు, కె.నిత్య, కె.సుబ్రహ్మణ్యం, ఎం సుధీర్, అమానుల్లా ప్రమాణ స్వీకారం చేశారు. వారికి మాజీ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, జీవీఎస్‌కే కిషోర్ తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సత్కారించారు. న్యాయవాదులు చదలవాడ కుమార్, దశయ్య మొదలియార్, మొరా ఈశ్వరయ్య, దారా రవి తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం



దామోదర్‌రెడ్డి దంపతులకు సన్మానం

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న దామోదర్‌రెడ్డి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మి సన్మాన సభ ఏర్పాటు చేసి దామోదర్‌రెడ్డి దంపతులను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్డీ ఎం.రేణుక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, సిబ్బంది రవీంద్రబాబు, నాగేశ్వర్‌రావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయంపై దృష్టి సారించాలి



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కౌన్సిలర్

వెంకటగిరి(సైదాపురం): మున్సిపాలిటీ ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కమిషనర్ వెంకటరామిరెడ్డికి సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని, వాటిలో దుకాణాలు నిర్మించాలని కోరారు. పాత కూరగాయల మార్కెట్ వద్ద నూతన భవనాలు నిర్మించాలన్నారు.

ఘర్షణలో ఒకరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మర్లపల్లి గ్రామంలో పొలం విషయమై సొంత బంధువుల మధ్య మంగళవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వచ్చి వారిస్తున్నా మహిళలు వారి మాట కూడా వినకుండా జుట్లు పట్టుకుని ఘర్షణ పడడం విశేషం. ఈ గొడవల్లో మర్లపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని అతని సమీప బంధువులే రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచారు. గాయ పడిన ప్రసాద్ వైద్యశాలలో చికిత్స చేయించుకుని, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చిల్లకూరు: వరగలి క్రాస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండగా మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రిలోని పోస్టుమార్టంకు తరలించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారి వివరాల మేరకు జాతీయ రహదారిపై చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి గుంత వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన వ్యక్తిని పరిశీలించగా అతనికి 58 సంవత్సరాల వయస్సు ఉంటుందని గడ్డం పెంచుకుని ఉన్నాడని తెలిపారు. అతనిని గుర్తించిన వారు చిల్లకూరు ఎస్‌ఐ సురేష్‌బాబును సంప్రదించాలని కోరారు.

తిరునాళ్లను విజయవంతం చేయండి



తిరునాళ్లపై సమీక్షిస్తున్న గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

దక్కిలి: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన దేవునివెల్లంపల్లి గ్రామంలోని శ్రీస్తంభాలగిరీశ్వరయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. మంగళవారం దేవునివెల్లంపల్లిలో స్వామివారి ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల13 నుండి 16వ తేదీ వరకు తిరునాళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. తహశీల్దార్ మోపూరు శ్రీనివాసులు, ఈఓ శ్రీనివాసులు, ఎంపీపీ జి.రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, వెంకటగిరి సీఐ ఏవీ రమణ,ఎస్‌ఐ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



